

చెహోవ్ కథ



# సుఖాంతం

**రష్యన్‌మూలం: చెహోవ్**
**తెలుగు గొంతు: కరుణారుణ**

ఒకనాడు నికొలాయ్ స్టిచ్కిన్ ఏదో వ్యవహారం చర్చించటానికి లుబోవ్ గ్రిగోర్యేవ్నా అనే మధ్యవయస్కురాల్ని ఇంటికి ఆహ్వానించాడు. లుబోవ్‌ది భారీ శరీరం. ఇంచుమించు నలభైకి ఇటూ అటుగా వుంటుంది. పెళ్లిళ్లూ లేదా అలాంటి ఇతర పనులూ కుదర్చడంలో అనుభవమున్నది. సంభాషణ ఎలా ప్రారంభించాలా అని స్టిచ్కిన్ గదిలో పచారు చేస్తూ ఆలోచిస్తున్నాడు.

'లుబోవ్‌గారూ, మీరిక్కడికి రావటం చాలా సంతోషంగా వున్నది. నిజానికి సెమ్యాన్ ఈ విషయాలు మీతో మాట్లాడితే బాగుంటుందని సలహా ఇచ్చాడు. దాచుకోకుండా అన్నీ వున్నదున్నట్టు చెప్పేస్తాను. నాకిప్పుడు యాభైరెండు. పెళ్లైవుంటే ఇప్పటికి ఎదిగిన పిల్లలుండాల్సింది. అవన్నీ ఎందుగ్గాని, ఇప్పుడు నేను చేస్తున్నది చిన్న వుద్యోగమేం కాదు. పెద్ద ఆస్తిపరుణ్ణి కాకపోయినా భార్యాపిల్లల్ని పోషించగలను. బ్యాంక్‌లో డిపాజిట్లు కూడా బాగానే వున్నాయి. దురలవాట్లేమీ లేవు. మర్యాదగా, గౌరవప్రదంగా బతకటమే నాకిష్టం. నలుగురూ నన్ను చూసి సత్ప్రవర్తన అంటే ఏమిటో

తెలుసుకోవాలి. ఇంక నాకు లేంది ఏమిటంటారా? ఇంటికి రాగానే చిరునవ్వుతో ఎదురొచ్చే భార్య. ఎంత ఆస్తి వున్నా, గౌరవం వున్నా, బతుకు పంచుకోవటానికే మనిషి లేకపోవటం పెద్ద వెలితి కాదంటారా? అంతేకాదు బ్రహ్మచారుల కన్నా, గృహస్తులకే ఈ సమాజంలో ఎక్కువ గౌరవం. అందువల్ల, లుబోవ్ గారూ, మీరు సహాయం చేస్తే నేనో ఇంటివాణ్ణి కావాలనుకుంటున్నాను.

'మంచి నిర్ణయం.' అంది లుబోవ్.

ఈ వూళ్లో నాకెవ్వరూ తెలియరు. పైగా నేనంత కలుపుగోలు మనిషిని కాను. ఎవరితో మాట్లాడాలన్నా మొహమాటం. ఈ వివాహ ప్రయత్నం నాకు వీలువడదు గనకే మీ సహాయం అభ్యర్థించాను.'

'ఓయస్. మీకు చక్కటి సంబంధం తీసుకొస్తాను చూడండి.'

'ఇదిగో కాఫీ తీసుకోండి.'

ఒక్క గుక్కలో కాఫీ తాగేసి 'ఎలాంటి వధువు కావాలి మీకు' అంటో అడిగింది లుబోవ్.

'ఎలా రాసుంటే అలా జరుగుతుంది. ఎవరైనా ఫరవాలేదు.'

'అది నిజమేగాని, మనకేవో కోరికలుంటాయిగా. తెలుపు, ఎరుపు పొట్టి, పొడుగు, సన్నం, బొద్దుగా'

'లుబోవ్ గారూ, చెప్పానుగా. నేను శారీరక ఆకర్షణలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే మనిషిని కాను. స్త్రీకి అందమైన మొహం వుంటే లాభమేమిటి? ఫేస్ క్రీములకు ఎక్కువ డబ్బులు ఖర్చవుతాయి. ఆత్మ సౌందర్యం ముఖ్యం, మరో కాఫీ, ప్లీజ్. అఫ్‌కోర్స్. బొద్దుగా, ఎర్రగా వుంటే బాగానే వుంటుంది. కాని అదంత ముఖ్యం కాదు. అందం కన్నా తెలివి ముఖ్యం. తెలివి తేటలెక్కువవున్నా చిక్కులే అనుకోండి. నన్ను అర్థం చేసుకునేటంత తెలివీ, నన్ను ఆకర్షించేంత అందమూ వుంటే చాలు. ఇంటిపనీ, వంటపనీ వచ్చి వుండాలి. సర్లెండి. ఎవరో ఒకరు, సంసార పక్షం మనిషి కావాలి.'

'బాగా చెప్పారు.'

'నాకు కట్నాలమీద ఏమీ ఆశలేదు. భార్య డబ్బుల మీద నాకేమీ ఆశలేదు. అట్లాగని మరీ పేదింటి పిల్లా వద్దు."

'ఎంతో కొంత కట్నం ఇచ్చే వాళ్లనే చూస్తాను లేండి.'

'మరింత కాఫీ...'

'ఇదంతా పెళ్లి గురించి. బ్రహ్మచారుల వినోదం కోసం ఎవరైనా కావాలంటే చెప్పండి. ఒక ఫ్రెంచి అమ్మాయీ. ఒక గ్రీక్ అమ్మాయీ రెడీగా వున్నారు'.

స్టిచ్కిన్ ఆలోచించి,

'థాంక్స్. ఇంతకూ ఇలాంటి కేసులకు మీ ఫీజెంత?'

ఎక్కువ లేదండీ. పాతిక రూబుల్స్. ఓ డ్రెస్. కట్నం గనక సెటిల్ అయితే అందులో కొంత పర్సెంటేజీ...'

'ఫీజెక్కువగా వున్నట్టుందే..'

'లేదండీ. ఈరోజుల్లో పెళ్లిళ్లే తగ్గిపోయాయి. గిరాకీ దొరికినప్పుడేగా మేం ఏమన్నా చార్జి చెయ్యగలిగేది.... పైగా మా ఆదాయం పెళ్లిళ్లు కుదర్చటంలో రాదు... నెలకు రెండు పెళ్లిళ్లు తగిల్తే గొప్ప. యాభై రుబుళ్లు...'

స్టిచ్కిన్ నమ్మలేనట్టుగా లుబోవ్ వైపు చూస్తూ 'అంటే నెలకు యాభై రుబుళ్ల సంపాదన తక్కువా?'

'ఆఁ. ఇదివరలో వంద సంపాదించే వాళ్లం.'

'అమ్మో. ఈ వృత్తిలో కూడా ఇంత డబ్బుందని నాకు తెలియదు.' అన్నాడు స్టిచ్కిన్, 'నెలకు యాభై... అంటే యేడాదికి ఆరొందలు. ఇంత సంపాదిస్తున్నారు. మీరే ఓ వరుణ్ణి కుదుర్చుకొని స్థిరపడొచ్చుగా.'

'నేనా. నా వయసెంతనుకున్నారు?'

'ఎంతైతేనేం. చూడ్డానికి బాగానే వున్నారు.'

లుబోవ్‌కు సిగ్గుతో మొహం ఎర్రబడింది.

'నిజంగా చెబుతున్నాను. మీరు చాలా అందంగా వున్నారండీ. మీ వయసుకు తగిన వాణ్ణి, మర్యాదస్తుణ్ణి ఎవర్నైనా చేసుకుంటే, మీ సంపాదనా, పొదుపరితనమూ, అతడి సంపాదనా కలిసి హాయిగా గడపచ్చు.'

'అలాగ ఆశలు పెట్టకండి.'

'నిజంగా చెబుతున్నాను.'

కాస్సేపు నిశ్శబ్దం.

'నికోలాయ్, మీ జీతమెంత?' అని అడిగింది లుబోవ్.

'ఎంతా? నెలకు డెబ్బై అయిదు రూబుళ్లు. పైన కాస్త బత్తా, బోనస్... పైగా నా వయసును బట్టి నాకు మరీ చిన్నపిల్ల వద్దు. ఇంచుమించు మీ వయస్సున్న స్త్రీ. ఆరోగ్యంగా, దృఢంగా వున్న మధ్య వయస్కురాలైతేనే బాగా వుంటుంది.'

'అబ్బా. నేను మాట్లాడలేను బాబూ, సిగ్గు' అంది లుబోవ్.

'ఇంకా సందేహమెందుకు, లుబోవ్ డియర్, నువ్వే నా హృదయరాణివి. నీకు నేనూ. నాకు నువ్వూ'

'ఒక్క నిమిషం. నా భార్యనుంచి నేనేం ఆశిస్తున్నానో చెబుతాను విను. నేను చాలా నిక్కచ్చి మనిషిని. ఒక్క కోపెక్కు కూడా దుబారా చెయ్యకుండా గడిపే మనిషిని. నా భార్య కూడా, నాలాగే వుండాలి.'

అంటూ తన దృష్టిలో సతీ ధర్మాలంటే ఏమిటో బోధించటానికి వుపక్రమించాడు నికొలాయ్.

■

## ప్రకాశ్‌రాజ్ బాలీవుడ్‌కు

ప్రయాణం కట్టాడనేది తాజా వార్త. అసలీ అవకాశం అతని కెన్నడో వచ్చి వుండవలసింది. బాలీవుడ్ దర్శకుడు రాజ్‌కుమార్‌సంతోషి చిత్రం 'ఖాకీ'లో ప్రకాశ్‌రాజ్ కూడా ఓ పాత్ర చేస్తున్నాడు. మరో చిత్రంలో ప్రకాశ్‌రాజ్ కోసం ఓ ప్రత్యేకపాత్రను తయారుచేసిన సంతోషికి, 'ఖాకీ'లోని ఓ పాత్రకు ప్రకాశ్‌రాజైతే సరిగ్గా సరిపోతాడనిపించిందట. "అది అతని టైప్ పాత్ర. కనుక అతను సులువుగా చెయ్యగలుగుతాడు" అన్నాడు సంతోషి. మహత్తరనటుడుగా పేరు వడిన ప్రకాశ్ తన పేరుతో పాటు, కన్నడదేశం పేరూ నిలబెడతాడు తప్పకుండా!

ఎస్.

